# రియల్ ఎస్టేట్

వాన పడుతున్నది. ఎన్నో రోజుల నిరీక్షణ తర్వాత రాత్రి నుంచి మంచి ముసురు పట్టింది. నిరీక్షణలో ఒక విధమైన ఆనందం ఉంటుందేమో. మల్లయ్యకు ఎంతో హాయిగా ఉంది. నిజానికి యీరోజు "చెట్లల్లకు పోవుడు" అనే వన భోజన కార్యక్రమం పెట్టుకున్నారు. ఈ సందర్భంగా కొడుకును పంపి కొత్త అల్లుడు సుధాకర్‌ను ఊరి



నుంచి నిన్న సాయంత్రమే పిలిపించుకున్నాడు. అది వాయిదా పడినట్టే ఉంది. అయినా సంతోషంగా ఉంది.

కిటికీలోంచి తన అందమైన తోటలోకి చూశాడు మల్లయ్య. ఉదయం ఆరుకూ ఎనిమిది మధ్య తేడా తెలియడం లేదు. ఆకాశం నిండా నలనల్లని మబ్బులు.

పేస్టుతో బ్రష్ చేసుకొని ముహం కడుక్కొని ఎప్పటిలా పొద్దుతిరుగు పువ్వు రిఫైండ్ ఆయిల్ పుట్కిటపట్టి పుక్కిలిస్తూ వరండాలోకొచ్చాడు మల్లయ్య.

మల్లయ్య యిల్లు చాలా అందమైనది. ఆరు గజాల ఎత్తు మించిన ఎనిమిది కొబ్బరి చెట్లు గేటుపైన గ్రిల్స్ కమాను. దానిపై చిక్కగా అల్లుకున్న జాజి పందిరి. ప్రభుత్వ అగ్రికల్చర్ ఫారం నుంచి తెచ్చిన రకరకాల మొక్కలు, మెత్తని గడ్డి. పందిరంతా పాకుతున్న బీర, సోర, చిక్కుడు, దొండ, కాకర పాదులు, రెండు బెండ మడులు, ఒక కొత్తిమీర మడి. నాస్తిక గోరా ఆ యిల్లు చూస్తే పూలచెట్లనూ కాయగూరచెట్లనూ యింత అందంగా సమన్వయించవచ్చునా అని ముక్కున వేలేసుకుంటాడు. ఆ తోట చదువుకున్నవారి వ్యవసాయ సంస్కృతికి ఒక ప్రతీక. ఆ యిల్లు, ఆ తోట ఆ వీధికి ఒక అందం.

మల్లయ్య చాలా సాదాగా ఉంటాడు. అతని నల్లని ముహంలో ఒక తేజస్సు. అతని వ్యక్తిత్వంలో ఒక ప్రసన్నత, ఒక సరళత్వం. అతను యాభయిలో పడ్డాడు. పేద వ్యవసాయ కుటుంబంలో పుట్టిన మల్లయ్య కష్టపడి చదువుకొని పైకివచ్చాడు. అతని భార్య ఎల్లమ్మ బి.ఇడి. చేసి స్కూలు అసిస్టెంటు చేస్తోంది. వారికి నలుగురు పిల్లలు. మల్లయ్య కూడా కొంతకాలం స్కూలు అసిస్టెంటుగా చేశాడు. ఆ తర్వాత ఎకనమిక్స్‌లో, లిటరేచర్‌లో రెండు ఎమ్మేలు చేశాడు. ప్రస్తుతం ఎకనమిక్సు లెక్చరరుగా పనిచేస్తున్నాడు.

అతనికి ముగ్గురు తమ్ముల్లు. ఒక చెల్లెలు. ఒక గుడిసె, అర ఎకరం పొలం వారి ఉమ్మడి ఆస్తి. అతనికి ఉద్యోగమయ్యాక దాన్ని ఆనుకొని రెండెకరాలు కొన్నాడు. డిగ్రీ చేసిన తన తమ్ముడు ఊళ్లో ప్రయివేటు స్కూలు నడుపుకుంటూ యిపుడా పొలం చూసుకొంటాడు. దానికి మల్లయ్య కరెంటు మోటారు కూడా పెట్టించాడు.

కష్టపడి పైకొచ్చేవారిలో ఉండే లక్షణాలు మల్లయ్యలోనూ ఉన్నాయి. అతను టీచర్ అయ్యాక కూడా ఉదయం, సాయంత్రం తమ పొలానికి నీరు ఏతం పోస్తుండేవాడు. విద్యార్థులకది ఆదర్శంగా చెప్తుండేవాడు. అతనికి పని చేయడం అంటే ఎంతో సరదా. పని చేస్తుంటే అతనికి చక్కని మూడ్ వస్తుంది. ఎంతో గొప్ప ఆలోచనలు వస్తాయి. పని అనేది అతనికి ఒక ధ్యానం. ఆ తోట అందంగా రూపుదిద్దుకోవడానికి అది కూడా ఒక కారణం.

అతనికి పని అంటే ఎంతో ప్రేమా, గౌరవమూను. అతను చిన్నప్పుడు పనిచేసుకుంటూ చదువుకోవడం ఒక అవసరం. పనిలో కలిగే ఆనందం వల్ల యీనాడు అతనికది సరదాగా మారింది. అదే అతని సంస్కృతిని, సంస్కారాన్ని తీర్చిద్దింది.

పనిచేస్తే కలిగే అలసటలోనూ ఆనందం ఉంటుందని ఎందరికి తెలుసు.

మల్లయ్యకు మావో అంటే ఎంతో అభిమానం. మావో ఇండియాలో పుట్టి అంబేద్కర్‌తో దోస్తీ పట్టాల్సిన వాడంటాడతడు. చైనాలో మావో ప్రవేశపెట్టిన విద్యా ప్రణాళికను, కమ్యూన్లను ఎంతో అభిమానిస్తాడు మల్లయ్య. ఒక పూట పని ఒక పూట చదువు అనే షిఫ్టు పద్ధతి అతనికి గొప్ప ఆదర్శం. కులవ్యవస్థ విధించిన దారిద్ర్యం, అసమానతలకు "పని-చదువు" షిఫ్టు పద్ధతే పరిష్కారం అంటాడతడు. అపుడే మన యిండియాలో "నిర్బంధ ప్రాథమిక విద్య" ఆశయం నెరవేరడంతోపాటు "ఉన్నత విద్య" అందరికీ అందుబాటులోకి వస్తుందని అతని విశ్వాసం. తద్వారా ఈ దారిద్ర్యం, సోమరితనం, పనిపట్ల అగౌరవం, కులమతాల హెచ్చుతగ్గులు అదృశ్యమవుతాయంటాడు. అపుడే ప్రపంచంలో యిండియా ఒక ఆదర్శరాజ్యంగా ఎదుగుతుందంటాడు. అదే విషయం క్లాసులోనూ చెప్తుంటాడు. అతడు తన ఆదర్శానికనువుగా ఎన్నో ఉద్యమాల్లో పనిచేశాడు.


మల్లయ్య పిల్లలు అతని ఆదర్శాలను పుణికిపుచ్చుకున్నారు. వాళ్లకు చదువంటే ఎంత శ్రద్ధో పని అంటే అంతే శ్రద్ధ. తమకు అందరికన్నా బాగా మార్కులొస్తాయనే గర్వం వారిలో ఏ కోశానా లేదు. అందుకేనేమో ఆ పిల్లల్ని అందరూ యిష్టపడతారు.

మల్లయ్య పెద్ద కొడుకు సందీప్‌కు యీ మధ్యే ఓ ప్రయివేటు యింజనీరింగ్ కాలేజీలో లెక్చరర్ జాబ్ దొరికింది. అయినా అతడు "గ్రూప్ వన్" ఆర్డీవో, సిటివో ఉద్యోగం సాధించాలనే ధ్యేయం పెట్టుకున్నాడు. రెండో సంతానం పావని కాకతీయ మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్. చేస్తోంది. మూడోవాడు క్రాంతి డిగ్రీ చేస్తున్నాడు. చిన్నమ్మాయి శ్రావ్య యిటీవలే యింటర్లో జిల్లా ర్యాంకు సాధించింది. సందీపూ, పావనీ వనభోజన కార్యక్రమానికి రాలేమని నిన్న సాయంత్రమే యింటికి ఫోన్ చేశారు.

మల్లయ్యను పిసినారి అన్నవాళ్ళు లేకపోలేదు. ఆ మాట అబద్ధమనే చెప్పాలి. అతను వేస్టు ఖర్చులు చేయడనే మాట వాస్తవం. అటెండరుగా పనిచేస్తున్న పెదతమ్ముడి కూతురు సుధను తన యింట్లో తన కూతురులాగే పెంచాడు. డిగ్రీ రెండో సంవత్సరం పరీక్షలు రాశాక వేసవి సెలవుల్లో మంచి సంబంధం కుదిరితే సుధకు యిటీవలే తన యింట్లోనే పెళ్లి జరిపించాడు.

ఆషాఢమాసంలో సుధ అత్తవారింటి నుంచి తల్లిగారింటికి వెళ్లి వారం రోజులుండి పెదనాన్న యింటికి యిటీవలే వచ్చింది. కొత్త పెళ్లి కొడుకు సుధాకర్‌కు తొలి ఆషాఢ విరహం యింకా తీరినట్టు లేదు. సుధ మాత్రం అపుడే తలారా స్నానం చేసినట్టుంది. తలకు గుడ్డ చుట్టుకుంది. వర్షంలో సుతారంగా మల్లెపూలు తెంపుతోంది. తనలా దానికీ వర్షంలో తడవడం అంటే ఎంతిష్టమో అని నవ్వుకున్నాడు మల్లయ్య.

సుధను చూస్తుంటే రాత్రి భోజనాలకాడ అల్లుడూ, సుధా సరదాగా పెట్టుకున్న వాగ్వాదం గుర్తొచ్చింది మల్లయ్యకు. హాయిగా నవ్వుతూనే చర్చించారు గానీ చర్చించిన విషయం సీరియస్ అంశమే. సుధ తాను పెద నాన్నయింట్లో ఉండి ఈ ఏడాది అంతా




డిగ్రీ పూర్తి చేస్తానని అంది. అల్లుడికి పెళ్లి తాలూకు కొత్త మోజు తీరినట్టు లేదు. ఏవేవో చెప్పి ఆ మాట దాటవేశాడు. మల్లయ్య జోక్యం చేసికోకుండా నవ్వేశాడు. రాత్రినించి అదే విషయం ఆలోచిస్తూ ఉన్నాడు.

సుధాకర్‌ది చాలా పేద కుటుంబం. ఇంటికి పెద్దవాడు. జిల్లా పరిషత్ యింటర్వ్యూలో యిటీవలే టి.టి.సి. టీచర్ ఉద్యోగం వచ్చింది. ఈ ఉద్యోగంకోసం ఎమ్మెస్సీ ఆఖరు సంవత్సరాన్ని అతడు వదిలేయాల్సి వచ్చింది. సుధాకర్ అందుకు రెడీ అయ్యాడు. పెళ్లి చూపులప్పుడు యివన్నీ పైపైన చర్చించారు గానీ కచ్చితంగా యిలాగే ఉండాలని అనుకోలేదు.

సుధ ఆలోచనేమంటే తాను ఎమ్మెస్సీ చేయాలని, సుధాకర్ ఎమ్మెస్సీ, పిహెచ్‌డీ చేయాలని. సుధకు పెదనాన్నే ఆదర్శం. పెద్దమ్మలా తాను ఉద్యోగం చేయాలని సుధ లక్ష్యం. అయితే పదో తరగతి నాలుగుసార్లు ఫేలయిన సుధ చెల్లెలు భవిత యిక నేను చదవనని మొండికేసింది. చదువు మానేస్తే మిగిలింది యిక పెళ్లి చేయడమే కదా అని తండ్రి తొందర. అక్క పెళ్లి కాకుండా చెల్లెలు పెళ్లి ఎన్నో ఊహాలకు దారి తీస్తుంది. అందుకని తండ్రి తొందర పెట్టాడు. పెద్దనాన్న మల్లయ్య కూడా తమ్ముడి తొందరను అర్థం చేసికొన్నాడు. అలా సుధ విధిలేని స్థితిలో పెళ్లికి ఒప్పుకుంది. తన స్టడీకి అంతరాయం కలుగొద్దనే హామీ తీసుకుని మరీ ఒప్పుకుంది సుధ.

ఎల్లమ్మా, శ్రావ్యా వనభోజన ఏర్పాట్ల హడావిడిలో ఉన్నట్టున్నారు. వర్షంలో నీళ్లోడుతూ, క్రాంతి స్కూటరు స్టాండువేసి యింత మటనూ, ఓ బ్రాయిలర్ కోడినీ పట్టుకొస్తూ కన్పించాడు. మల్లయ్య ఆయిల్ పుక్కిలిస్తూ లుంగీ పైకి చెక్కుకుని పొడవాటి కర్రెతెడ్డు తీసికొని యింటి మురికి కాల్వ తీయడానికన్నట్టుగా వాకిట్లోకి నడిచాడు. ఈ వానలో ఎలాగైనా తడవాలని అతని ఆలోచన.

ఒక్కసారిగా ఏదో కంపువాసన గుప్పుమని విసిరికొట్టింది. పక్కనున్న ఖాళీ ప్లాటులో రాత్రి ఎవరో చచ్చిన పిల్లినో, కుక్కనో పడేసిపోయినట్టున్నారు. మల్లయ్య ఆహ్లాదకరమైన మూడ్ ఒక్కసారిగా చెదిరిపోయింది. ఈరోజైనా యీ వీధి గొడవ మరిచిపోదామనుకుంటే యిలాగైంది. తన పక్కనున్న ఖాళీ ప్లాటు ఓనరు పైకి కోపం మళ్లింది.

ఆ ప్లాటు పన్నెండేళ్ల క్రితం తానే కొందామనుకున్నాడు. తన సన్నిహిత మిత్రుల్ని తీసుకొచ్చి మొహమాటపెట్టాడు రవిందర్. అతడు ఏడాదిలోగా యిక్కడ యిల్లు కట్టుకుంటానని హామీ యిస్తే తోడుంటాడు గదా అని తానే బేరం చేసిపెట్టాడు. కాని అతని ఆలోచన వేరని యీ పన్నెండేళ్ళుగా అర్థం అవుతూనే ఉంది. అతనికి యిక్కడ యిల్లు కట్టాలనే ఆలోచన లేదు. ఇలాగే 4, 5 చోట్ల ప్లాట్లు మాత్రం కొనిపడేశాడు. ఎరక్కపోయి అతనికి తానీ స్థలం యిప్పించినట్టయింది. ఓ నాలుగు యిళ్ల ప్లాట్లు కొనడం, చుట్టూ యిళ్లయ్యాక ధర పెరిగితే అమ్మడం కొందరికి అదో వ్యాపారమైపోయింది.

ఆ ఖాళీ ప్లాటులో యిల్లు కట్టకపోవడం వల్ల తనకు ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. ఆవైపు ప్రహరీగోడ మొత్తం తన డబ్బుతోనే పెట్టుకోవాల్సి వచ్చింది. అలా మూడు వైపులవాళ్ళు విసిగిపోయి ఎవరి తిప్పలు వాళ్లు పడితే అదంతా యీ ప్లాటుకు పెట్టని కోట గోడైంది. పన్నెండేళ్ల క్రితం పదివేలకు గుంట (121 చదరపు గజాలు) చొప్పున యిప్పించాడు తాను. ఇపుడది అరవై వేలకు గుంటైంది. అయినా అతనికి తృప్తిలేదు. లక్ష రూపాయలు ధర చెప్తుంటాడు.

ఏమీ చేయకుండా సంపాదించే వ్యాపారాల్లో ఈ "రియల్ ఎస్టేట్" వ్యాపారం ఒకటి. ఎక్కడో ఊరికి దూరంగా అడవిలా ఉన్నప్పుడు కొని పడేస్తారు. అవసరం ఉన్నవాళ్లంతా యిల్లు కట్టుకుంటారు. ఆ వెనక ఓ సిన్మా టాకీసో, కాలేజీయో, బస్టాపో, మార్కెటో, నర్సింగ్ హోమో అక్కడ వెలిస్తే యిక ఆ ప్లాట్ల ధరలు చూడాలి. దాన్ని

రవిలాంటి వాడు సొమ్ము చేసికొంటాడు. కొత్తగా కట్టే యిల్లు పక్కింటివారికన్నా ఒక అడుగు ఎత్తులేపి కడ్తారు. దాంతో ముందుగా కట్టిన యిళ్లు భూమిలో కుంగినట్లు కనపడుతాయి. తొలుత కట్టుకునేవాడు రోడ్డు ఎత్తు పెరుగుతుందని అంచనా వేసి కట్టినా ఏం లాభం? 25-30 ఏళ్లకు రోడ్డు ఎత్తవుతుంది. ఇల్లు నదలు(పల్లం) అవుతుంది. ఇలా లాభం ఖాళీ ప్లాటు వాళ్ళకు. నష్టం ఇల్లు కట్టుకున్నవాళ్ళకా? తాము యిళ్లు కట్టకపోతే వీడి ప్లాటు గుంటకు యిరవై వేలైనా పలికేది కాదు.

వీళ్లు కరెంటు స్థంభాలు వేయించే పైరవీకి రమ్మంటే రారు. ఖర్చుల్లో పైసా యివ్వరు. ఎన్ని డొనేషన్లు వేసికొని మురికి కాల్వల్ని కట్టిస్తే మునిసిపాలిటీ టేకప్ చేసిందో వీరికి పట్టదు. ఇలాంటి విషయాల్లో వాల్లు యిక్కడి పౌరులు కాదట. అవసరం మీది. మేం యిల్లు కట్టుకున్నపుడు లెక్క కదా అని తప్పించుకుంటారు. ఈనాడిది ఊళ్లోని మంచి సెంటర్లలో ఒకటి. దీనివెనక పాతికేళ్ళ కృషి ఉంది. ఆ కాలనీ అభివృద్ధికి మల్లయ్య ఎన్నుకోబడని కార్యదర్శి. ఈ కృషి వల్ల పెరిగిన రేటుకు వీళ్లు ప్లాట్లు అమ్ముకోవడానికి మాత్రం రెడీ.

మల్లయ్య యిలాంటి లెక్కలు చేయడంలో దిట్ట. పక్క ప్లాటువాడు అప్పనంగా పొందే లాభాల్ని చూస్తుంటే వాన్ని నమిలి మింగేయాలనుకుంటాడు. వీని బుద్ధి ఆనాడు తనకే ఉంటే యీ ప్లాటు తనదే అయి వుండేదని అతని బాధ. తన విశాల హృదయం ఏమిటికి అక్కరకొచ్చింది. పక్కవాడు అప్పనంగా లాభాలు దండుకోవడానికా?

"రియల్ ఎస్టేట్" వ్యాపారమంటే చాలామంది యిళ్లు జాగల వ్యాపారం అంతే కదా అనుకుంటారు. 'రియల్ ఎస్టేట్' వ్యాపారమంటే మానవ సంబంధాల్ని వ్యాపారంగా మార్చుకోవడం. మనుషులున్నచోట మానవ సంబంధాలున్నచోట రద్దీ పెరుగుతుంది. వాటి తీరునుబట్టి వారి కులం, మతం, వర్గం, హోదా, సౌకర్యాలనుబట్టి ప్లాట్ల ధరలు పెరుగుతున్నాయి.

ప్రపంచంలో పలు విధాలైన "రియల్ ఎస్టేట్" వ్యాపారాలు సాగుతున్నాయి. విద్య-విజ్ఞాన సంబంధి ఒకటైతే ఆర్థిక సంబంధి మరొకటి. వివిధ అధికార రాజకీయ అధికార సంబంధి యింకొకటి. సాంఘిక అంతస్తు-సంస్కృతి-కులం- దృక్పథం-పురుషాధిపత్యం వగైరా సంబంధి మరొకటి. మీడియా-పత్రికలు-రేడియో, టీవి. వగైరా సంబంధి వేరొకటి. క్రీడా, సినిమా సంబంధి మరొకటి. కళాసాహిత్యాల సంబంధి ఇంకొకటి.


వీటి విలువ పదవిలో ఉండే మంత్రికుండే విలువ వంటిది. తాను ఏ మేరకు యితర రియల్ ఎస్టేట్లతో మారకం చేసికోగలదో ఆ మేరకు తన విలువ చర-స్థిరాస్థులు, అధికారం పెంచుకుంటుంది. ఆ మేరకే యితర రూపాల్లోని రియల్ ఎస్టేట్‌ను సమకూర్చుకోవడం సాధ్యమవుతుంది. ఇవన్నీ పరస్పర ఆధారిత రియల్ ఎస్టేట్లే. అయినప్పటికీ దేని ప్రత్యేకత దానిదే. అందువల్ల ప్రతి వర్గం, కులం, జాతి, దేశం, కుటుంబం ప్రతి ప్రత్యేక రియల్ ఎస్టేట్‌ను ఏ మేరకు సాధించుకుంటుందో ఆ మేరకు

అభివృద్ధిలో సమగ్రతను చేజిక్కించుకుంటుంది.

వివిధ రియల్ ఎస్టేట్ల విలువలు సమానం అయినపుడు ఆయా వ్యక్తులు, రంగాలు పరస్పరం యిచ్చిపుచ్చుకుంటారు. గౌరవించుకుంటారు. కల్సిపోయినట్టు కనబడతారు. వాటి మధ్య అసమానత ఏర్పడగానే ఆధిక్యతలో ఉన్నది తన ఆధిక్యతను ప్రదర్శిస్తుంది. ఎదుటిదాన్ని కించపరుస్తుంది అంటాడు మల్లయ్య.

విద్య అనేది ఒక గొప్ప రియల్ ఎస్టేట్. తనకు విద్య అనే రియల్ ఎస్టేట్ ఉన్నంతకాలం ఇతర రియల్ ఎస్టేట్లున్నవారూ గౌరవిస్తారు. తన అటెండర్ తమ్ముడిని తనతో సమానంగా గౌరవిస్తారా వాళ్లు?. విద్య అనే రియల్ ఎస్టేట్ ద్వారా తను సమానం చేసికొంటూ రావడంవల్లే యీ గౌరవం. అదిపోయిన్నాడు మళ్లీ మొదటికే. ఇలా ఒక రంగంలోని ఆధిక్యతతో మరో రంగంలో గౌరవం పొందడం తాత్కాలికమే. అందువల్ల ప్రతి రంగంలో ప్రత్యేక కృషి జరగడమే నిజమైన పరిష్కారం. అది జరక్కపోతే అంత దగ్గరి అచ్యుతరావూ దూరమైపోవడం సహజమవుతుంది అనుకున్నాడు మల్లయ్య.

సివిల్ కాంట్రాక్టరైన అచ్యుతరావుకు మల్లయ్య ఎన్నో విధాల సహకరించాడు. ఈరోజు ఆయన ఒక కాంట్రాక్టరుగా నిలదొక్కుకున్నాడంటే అది మల్లయ్య చలవే. ఆ మాట అచ్యుతరావు కూడా కాదనడు. అచ్యుతరావు కొడుకు లక్ష్మణ్‌రావు, మల్లయ్య కొడుకు సందీప్ క్లాస్‌మేట్స్. ఆ రెండు కుటుంబాలు ఎంతో సన్నిహితంగా మెలిగేవి. అచ్యుతరావు కూతురు సంధ్యను ఎల్లమ్మ సొంత కూతురులా చూసుకునేది.



సంధ్య సందీప్‌ను బాగా లైక్ చేస్తుండేది. సందీప్‌కు చదువు తప్ప మరో ధ్యాస లేదు. సందీప్ సంధ్యను చూస్తే యిరుగు పొరుగుకు కాస్త అసూయగా ఉండేది. సందీపూ, సంధ్యా చక్కని జోడీ అని అచ్యుతరావు, మల్లయ్య ఎవరి మనసులో వాళ్లు

అనుకున్న క్షణాలు లేకపోలేదు. ఓరోజు దగ్గరి బంధువు ఎవరో సంధ్య తల్లితో ఆ మాట అననే అన్నాడు. అప్పటికి అప్పులపాలైన అచ్చుతరావును అది మరో తీరుగా బాధించింది. ఎలాగు పెళ్లి చేయలేవు కులం తక్కువవాడికి అంటగట్టు అని చెప్పినట్టుగా ఫీలయ్యాడు. దాంతో ఎందుకో తెలియని కోపం వచ్చింది. "గేట్" ద్వారా సందీప్‌కు ఎంటెక్ సీటు వచ్చినపుడు సంధ్య ఎంతో సంతోషించింది. ముగ్గురూ కల్సి సెకండ్ షో సినిమా వెళ్లారు. ఆరోజు ఎందుకో ఉండబట్టలేక ఆ లేకి కులంవాడితో అంతగనం దోస్తాన ఏంది అని విరుచుకుపడ్డాడు అచ్చుతరావు.

"వాళ్ళతో నువ్వు చేయడం లేదా!" అని లక్ష్మణ్‌రావు తండ్రిని నోరు మూయించాడు. అదేం చిత్రమో కాని తండ్రి అన్న ఆ ఒక్కమాట ఏడాదిలో ఆ యింటి వాళ్లందర్నీ ఎంతో మార్చేసింది. అచ్చుతరావు తానన్నమాట ఎపుడో మరిచిపోయాడు. సందీప్ సంధ్యను చేసికొంటానంటే సరేననడానికి మానసికంగా సిద్ధమయ్యాడు. కానీ అడగడానికి అహం అడ్డొచ్చింది. కులంతార వివాహాలకు మధ్యవర్తి పెద్ద మనుషుల్తోపాటు తమ అహం దెబ్బ తినకుండా సంప్రదాయ పెళ్లిలాగే ఎంతో కొంత కట్నకానుకలు ఉండడం ఎంతో అవసరం అన్పించింది. అలాంటి వ్యవస్థ లేకపోవడాన ఎన్ని పెళ్లిళ్లు ఆగిపోతున్నాయో అని విచారించాడు అచ్చుతరావు.

లోకానికి వెరిచి సంధ్యా, సంధ్య తల్లీ ఎల్లమ్మ యింటికి వెళ్లడం తగ్గించారు. పైకి చూడ వాళ్ళ కులం మా కులం ఒకటి కాదుగా అని బింకాలు పోయారు. అవును సంధ్యను సందీప్ పెళ్లి చేసుకొంటే ఏం తప్పు? కాలు వంకరా? చెయ్యి వంకరా? చక్కని పిల్లవాడు అని ధైర్యంగా బయటపడి ఉంటే ఎలా ఉండేదో. ఈ విషయంలో ఎల్లమ్మ ఆలోచన వేరు.

ఎల్లమ్మకు కట్నంమీద ఆశ ఎక్కువ. తానేమీ కట్నం తేలేదనే విషయం మరిచిపోయింది. ఆ మాటంటే నేనేమైన తక్కువ సంపాదిస్తున్నానా అంటుంది. సందీప్ ఏ కులం పిల్లను చేసికొన్నా సరే. కాని ఆ కులంలో సందీప్‌లాంటి పిల్లవాడికి ఎంత కట్నం యిస్తారో తన కొడుక్కూ కొంచెం అటూ ఇటూగా అంతే కట్నం యివ్వాలని ఎల్లమ్మ ఆలోచన లేకపోతే సందీప్ అంత చదివి అలాంటి ఉద్యోగం చేసే అమ్మాయైతే ఏ కులం అయినా సరే పైసా కట్నం తీసికోను అని ఛాలెంజ్ చేస్తుంది. అక్కడికి సందీప్ తన తల్లి మెచ్చిన పిల్లనే చేసికొంటాడన్నట్టు!

తనది ఫలానా కులంకన్నా పై కులం అనుకోవడం కూడా తాను ఏం చేయకుండా సంపాదించాలనుకునే సోమరిపోతుల ఒక "రియల్ ఎస్టేట్" వ్యాపారమే. అక్కడ కొన్ని ప్లాట్లకు పెరిగిన ధర లభిస్తే యిక్కడ పుట్టిన కులానికుండే విలువ ద్వారా, సంబంధాల ద్వారా లాభం పొందాలని చూస్తారు. తనకు తాను గొప్ప కులం అని ఆపాదించుకున్న విలువను గుర్తించ నిరాకరించడం అందుకు పరిష్కారం. అందుకేనేమో, తమ యింటికి ఏడిళ్ల అవతల ఉన్న గాయత్రి ఆలోచన గుర్తొచ్చినప్పుడల్లా ఎల్లమ్మకు ఆమె మొహంమీద ఉమ్మేయాలన్నంత కోపం వస్తుంది. గాయత్రి కూతురు ఉమను సందీప్ ప్రేమిస్తున్నాడేమో

సనని గాయత్రి భయమట. వాడు దీన్ని ప్రేమిస్తే బావుండు అనే కోరికను యిలా భయం రూపంలో ప్రకటించడం కాదా యిది? ఇంటర్లో మూడేళ్లుగా దుమ్కీలు కొడుతున్న ఉమను ఏం చూసి ప్రేమిస్తాడనుకుంటున్నారో. అపుడు అచ్చుతరావు కూతురును ప్రేమించడమైంది. ఇపుడు దీన్ని ప్రేమించడమా? ఎక్స్‌టర్నరల్ డిగ్రీకి సంబంధించినవేవో పుస్తకాలు కొని పంపిమ్మని యిది రాయడం వాడు సొంత డబ్బుల్తో పంపడం నేరమైనట్లుంది. నాలిక గీసుకోవడానికి పనికిరాని కులంతో గాయత్రికి ఎంతెంత ఆశలో. మా మరిది చిన్నబిడ్డను, తన కొడుక్కు చేసికొమ్మంటే చేసుకుంటుందా? గాయత్రి! బాగా చదువుకున్న పిల్లగాన్లను బుట్టలో వేసుకోవడానికి మాత్రం రెడీ. చదువుకున్న పిల్లగాన్లను పైసా కట్నం లేకుండా ఎగరేసుకుపోయి అబ్బే కులం-మతం ఎక్కడివండీ అని ఆదర్శాలు వల్లిస్తారు. పెద్దింటికి పిల్లనివ్వు-చిన్నింటి పిల్లను చేసుకో అని ఊరకే అన్నారా? పైకులపు అమ్మాయిని చేసికొంటే ఎంత నరకమో కొడవటిగంటి కుటుంబరావు "పార్వతీ పరిణయం" కథలో చెప్పలేదూ! మా యింటికొస్తే ఏం తెద్చారు-మీ యింటికొస్తే ఏం పెడ్తారు అనే కొంచెపు బుద్ధులూ వీళ్లూనూ. అదే కదా వీళ్ల ప్రేమంటూ ఒలకబోసేది. ఎల్లమ్మ అలా పైకే అనేస్తుంది. తమ ఎదిగిన కొడుకుల్ని పైకులాల ఆడిపిల్లలు పైసా కట్నం లేకుండా ఎక్కడ ఎగరేసుకుపోతారోనని ఆమె భయం.

వర్షంలాగే మల్లయ్యలో ఆలోచనలు జల్లులుగా కురుస్తున్నాయి. ఆ చచ్చిన పిల్లిని వెతికి మురికి కాల్వలోకి నెట్టేశాడు. గతంలో యిదే పని ఎవరైనా చేసిఉంటే అరగంట క్లాసు తీసుకుని ఉండేవాడు.

మల్లయ్య ఈ మధ్య తన విశాల హృదయాన్ని అవసరమైనపుడే తెరిచే గదిలా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఊహించని ఎదురుదెబ్బలే అతన్నాస్థితికి తెచ్చాయి. దీని వెనక వైరుధ్యం ఏళ్ల సామాజిక పరిణామం ఉంది. వ్యక్తి స్వార్థానికి సామాజిక బాధ్యతకు మధ్య నిరంతర వైరుధ్యం ఉంటుంది. ఈ ముప్పయ్యేళ్లలో వ్యక్తి స్వార్థం గెలిచింది. మల్లయ్య ఓడిపోయాడు. అతని సామాజిక కృషి యితరుల వ్యక్తి స్వార్థానికి దారి సుగమం చేసింది.

మల్లయ్య స్వాతంత్ర్యానంతర తొలితరం విద్యావంతుల్లో ఒకడు. వందల ఏళ్ల తర్వాత తొలిసారిగా ఉన్నతవిద్య అందుబాటులోకి వచ్చిన పేద విద్యార్థుల్లో ఒకడాయన. కూడు పెట్టని కులవృత్తులు వదిలి విద్యతో ఉద్యోగం పొందినవారికి ఆయన ఒక ప్రతీక. మల్లయ్య కష్టపడి చదవడమే కాకుండా వినయవిధేయల్తో ఎదుటివారి మనస్సును యిట్టే చూరగొంటాడు. తొందరగా ఉద్యోగం రావడంలో ఆ వినయమే మేలు చేసింది.

ఎల్లమ్మ అంత అందంగా లేకపోయినా ఆమె చదువు, ఉద్యోగం, సంస్కారం చూసి పైసా కట్నం తీసికోకుండా పెళ్లి చేసికొన్నాడు మల్లయ్య. పెళ్లయ్యాక మొదటేడు యింటివద్ద పక్క పొలం కొనడానికి అడ్వాన్సు యిచ్చాడు. రెండో ఏడు యీ ప్లాటు కొన్నారు. తమ యిద్దరి సంపాదన తమకే ఉండాలని ఎల్లమ్మ ఆలోచన. మల్లయ్య తన

ఊళ్లో తన ఉమ్మడి కుటుంబానికి పొలాలు కొనడం యితరత్రా ఖర్చుపెట్టడం మీద భార్యాభర్తల మధ్య కొత్తలో ఎన్నో కొట్లాటలయ్యాయి. ఊళ్లో ఆస్తి మన మొత్తం కుటుంబ ప్రతిష్ట పెంచుతుంది అని మల్లయ్య వాదించకపోలేదు. క్రమంగా మల్లయ్య ఓడిపోయాడు. ఎల్లమ్మే గెలిచింది. అప్పటినించి వారిమధ్య పొరపొచ్చాలు లేవు. అలా సామాజిక బాధ్యత, వ్యక్తి స్వార్థానికి మధ్య వైరుధ్యంలో తనదికాని రీతిలో మల్లయ్య రాజీపడక తప్పలేదు. సుధను చదివించి పెళ్లి చేయడం రూపంలో తాను ప్రాయశ్చిత్తం చేసికొన్నానని మల్లయ్యకు తృప్తి. ఎల్లమ్మకు కూడా మనసులో అలాగే ఉన్నట్టుంది.

ఎల్లమ్మకు తనదంటూ సొంతిల్లుండాలనేది జీవితాశయం. అది నెరవేరాక ఎంతో ఉదారంగా మారిపోయింది. కిరాయి ఇంట్లో ఉండే కష్టాలు ఆడవాళ్లకే హెచ్చు అనుభవం. ఏ కూరలు వండుకోవాలి. బంధుమిత్రులు ఎంతమంది రావచ్చు. ఏ వేళకు రాకూడదు మొదలైనవన్నీ యింటి ఓనర్లు నిర్ణయిస్తుంటారు. ఇల్లు కిరాయకు దొరకడానికి కొందరికి కులం అదనపు అర్హతలైతే ఎల్లమ్మకు అదొక అనర్హతగా పరిణమించింది. అలాంటి కష్టాలు పగవారికి కూడా వద్దనిపించాయి. ఆ కష్టాలు సొంతిల్లుండాలనే కోరికను బలోపేతం చేశాయనుకుంటుంది ఎల్లమ్మ.

మల్లయ్య యీ విషయంలో ఎల్లమ్మతో కొంచెం విభేదించాడు. ఉద్యోగానికి పూర్వం ఉన్న పేదరికం, కుల అణిచివేత కలిగించిన అభద్రత, అగౌరవం తాము యిల్లు కట్టుకోవడాన్ని తొందర పెట్టిందని యిపుడు వాపోతుంటాడు. తెలివి తక్కువ వాళ్లు యిల్లు కడ్తారు. తెలివి కలవాళ్లు అందులో నివసిస్తారు అనే సామెత గుర్తొచ్చినప్పుడల్లా తాము రెండూనూ అని నవ్వుకుంటాడు మల్లయ్య.

ఊళ్లో మరిన్ని పొలాలు కొన్నా యిపుడు ఎంతో ధర పలికేది అని బాధపడ్తుంటాడు మల్లయ్య. అలా కొంటే పెదతమ్ముడు అటెండరు పని చేయాల్సిన అవసరమే ఉండేది కాదు. ఇన్నేళ్లు కష్టపడితే తమకిపుడు మిగిలిందేమిటి పాతికేళ్ల పాతపడ్డ యీ యిల్లు తప్ప.

ఈ యిల్లు అమ్మేద్దామని మల్లయ్య ఆ మధ్య సీరియస్‌గా ఆలోచించాడు. అయితే యింత చక్కని యిల్లు అమ్మాలనుకోవడం వెనక ఉన్న కారణాలు వేరు. మొదటిసారి యీ చర్చ చేసినపుడు ఎల్లమ్మ కళ్లనీళ్లపర్యంతమై పోయింది. దుఃఖంతో ఆరోజు స్కూలుకు లీవు పంపి ఉపవాసంతో యింట్లోనే ఉండిపోయింది.

అయితే వీధిలో పోట్లాటలు, ఆడపిల్లల్ని ఏడ్పించడం రోజురోజుకు పెరిగిపోయాక ఎల్లమ్మ కూడా భర్త నిర్ణయానికి వచ్చేసింది. స్కూటర్‌పై యిద్దరు కల్సి నెల తిరిగారు మంచి ప్లాటు కోసం. తమ యిల్లుతో సాటిరాగలిదేదీ కన్పించలేదు. సొంతింటిపై ఉండే ప్రేమ దాంతో ఉండే అనుబంధం అలాంటిది. తాము ఆలస్యంగా యీ నిర్ణయం తీసికొన్నట్టు ప్లాట్ల రేట్లు వింటే అర్థమైంది. ఏదో మోస్తరు సెంటర్లో కొందామన్నా యీ యిల్లు అమ్మితే కాళీ స్థలమే వచ్చేట్టుంది.

తమ యిల్లుకేమో ఆశించిన ధర పలకలేదు. పాత యిల్లు. పాత మోడల్,

యింకెన్నేళ్లు ఆగుతుంది వగైరా లెక్కలు కట్టి ఆచితూచి బేరం అడిగారు. ఈమధ్య వాస్తు పిచ్చి కూడా పెరిగింది. మల్లయ్యకు వాస్తు పట్టింపు లేదు. రియల్ ఎస్టేట్ రంగంలో ఖాళీ ప్లాటుకుండే విలువ యిల్లుకుండదని ఎల్లమ్మకు అపుడర్థమైంది.

ఖాళీ ప్లాటు కొనేవాడు తనకు నచ్చిన రీతిలో యిల్లు కట్టుకోవచ్చు. వెసులుబాటు ననుసరించి దశలవారీగా యిల్లు కట్టుకోవచ్చు. ఎల్లయిసీ, హౌసింగ్ బోర్డు వగైరా సంస్థల నుండి లోన్ కూడా పొందవచ్చు. కట్టిన యిల్లు కొనడంలో యిలాంటి అవకాశాలు చాలా తక్కువ.

ఇల్లు ధర పలకకపోవడం తన సాయంతో ప్రయివేటు బస్సు కొన్న రాజిరెడ్డి బాగుపడిపోవడంతో పోల్చుకుని మల్లయ్య చాలా ఆవేదన చెందాడు. "మన సంపాదనంతా డెడ్ క్యాపిటల్ అయిపోయింది" అని విసుక్కున్నాడు మల్లయ్య. ఆ మాటతో ఎల్లమ్మకు ఎక్కడలేని దుఃఖం వచ్చింది. ఈ యిల్లు కట్టుకున్నాకే గదా మనను మనుషుల్లా చూసింది. ఈ యిల్లు యిచ్చిన ఆత్మ విశ్వాసం, అనుబంధం ఎంత గొప్పదో అపుడే మరిచిపోయారా? అని ఎల్లమ్మ చర్రున లేచింది.

వారి పిల్లలకు ఆ యిల్లు అమ్మ తర్వాత అమ్మవంటిది. అంతకన్నా కొంచెం ఎక్కువేమో. అమ్మయినా అపుడపుడు తిడుతుంది. ఈ యిల్లు ఎపుడూ చల్లని నీడనే యిస్తుంది. వాళ్లు యీ యిల్లును అమ్మను కాపాడుకోవడంలాగే ఫీలయ్యారు. ఈ యిల్లు మీది హక్కు కోసం యీ వీధి మీద సమాన హక్కు కోసం వాళ్లు విప్లవ సైనికుల్లా పోరాడుతున్నారు.

పాతికేళ్ల క్రితం ఎన్ని ఆదర్శాల్తో ఎన్నెన్ని ఊహల్తో తాము యీ స్థలం కొన్నారో. నేటితో పోలిస్తే అపుడే హాయి అన్పిస్తోంది. అన్నీ మనిషి యిష్టాయిష్టాల ప్రకారం నడవవు. చరిత్రకు ఒక క్రమం ఉంది. తన క్రమాన్ని అనుసరించి చరిత్ర ముందుకు సాగుతుంది. మల్లయ్య తానూహించిన సోషలిస్టు సమాజ ఆదర్శం వెనకబడిపోవడం అందులో భాగమేనేమో. అర్థశాస్త్రమే అన్నిటికీ నిర్ణాయక అంశం అనుకున్న తన ఆలోచనలోనే పొరపాటున్నట్టుంది. సోషలిస్టు విప్లవ పోరాటాలు వెనకడుగు వేసి గిడసబారిపోవడానికి యిదే కారణమేమో అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు మల్లయ్య.

తన యింట్లో వీధిలో జరిగే ప్రతి చిన్న విషయానికీ "జాతీయ, అంతర్జాతీయ పరిస్తితుల్లో భాగంగా" అంటూ ఆలోచించడం మల్లయ్యకు అలవాటు. అసలు ఏం జరిగిందంటే ఎం.బి.బి.యస్ చదివే పావని యింటర్లో ఉన్నప్పుడు జరిగిన ఒక సంఘటనతో ఆ కాలనీ రెండు వర్గాలుగా చీలిపోయింది. క్రమంగా తన వర్గం తగ్గి ఎదుటివర్గం బలపడ్డం మల్లయ్యలో వైరాగ్యాన్ని కలిగించింది.

పావని తన క్లాసుమేటు సునీత యింటికి వెళ్లి వచ్చేదారిలో కరెంటు పోవడం చూసి సునీత అవతలింటి బేవార్సుగాడు జడపట్టి లాగాడు. పావని చెప్పు తీసికొని కొట్టింది. వాడు కసిక్కున చెంపలు కొరికి పరుగెత్తాడు. మల్లయ్య పిల్లలు వారి స్నేహితుల్తో సహా అదే రాత్రి వాడి యింటిమీద దండయాత్ర చేశారు. దొరికిందల్లా తుక్కుతుక్కు

చేశారు. వాడు దవాఖానాలో బెడ్ పేషంటయ్యాడు. వాడి తల్లిదండ్రులు వాళ్ళ యింటిమీద దాడి చేశారని పోలీసు కేసు వేశారు. అది అంతర్జాతీయ బూర్జువా విష సంస్కృతి ప్రభావం పోనీలే అని మల్లయ్య వారించినా వినకుండా అతని పిల్లలు మానభంగయత్నం కేసు వేశారు.

అపుడు మొదలైంది ప్రచ్ఛన్న యుద్ధం. ఏ కన్న తండ్రయినా తన కన్నకూతుర్ని రేప్ చేశారని రచ్చకెక్కుతారా? అవ్వల్ల ! చిల్లర కులపోల్లకు సిగ్గేంది ఎగ్గేంది అంటూ ఎలా తోస్తే అలా వాగడం మొదలెట్టారు. ఆ బేవార్సుగాడి కులపోల్లు ఆ కాలనీలో కొంచెం హెచ్చుగా ఉన్నారు. ఆ ప్రచారమంతా వాళ్లదే. మల్లయ్య ఆదర్శాలు, విశాల ప్రపంచం, సోషలిస్టు సమాజం వగైరాలన్నీ మట్టికొట్టుకుపోయాయి.

ఏదో గుర్తుకు వచ్చి నోట్లోని ఆయిల్‌ను ఎవరిమీదో ఉమ్మేసినట్లుగా ఉమ్మేసాడు మల్లయ్య. నీళ్లతో పుక్కిలించి మళ్లీ పేస్టు బ్రష్షు అందుకొని రెన్నిమిషాల్లో ముహం కడుకున్నానని పించుకున్నాడు.

వాన కొంచెం వెలిసినట్టుగా ఉంది. వన భోజనానికి తరలి వెళ్లడానికి యింట్లో అందరూ రెడీ అవుతున్నట్టున్నారు. మటన్ ఉడుకుతున్నదేమో. కమ్మని మసాల ఘాటు గాలిలో తేలివస్తోంది.

సుధాకర్ బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ తోటను చూస్తున్నట్లుగా పూలు అల్లుతున్న సుధకేసి అదోలా చూశాడు. సుధ పెదనాన్నవైపు చూపిస్తూ సైగ చేస్తోంది. అంతలోనే ఆ కొత్త అల్లుడు వినయం ఉట్టిపడేలా మారిపోయాడు. సుధ కిలకిలా నవ్వింది. హూ! అని విసురుగా టవల్ తీసుకుని బాత్రూంకేసి నడిచాడు సుధాకర్.

మల్లయ్య అల్లుడూ కూతురూ సరసాల్ని చూసీ చూడనట్టుగా తోటలోకి నడిచాడు. వర్షానికి కిందికి జారిన బీర, చిక్కుడు తీగల్ని పందిరిపైకి సరిచేయడం మొదలెట్టాడు. అలా ఆ వీధికీ తమకూ పోట్లాట ఎపుడు ప్రారంభమైందో గుర్తు చేసికొంటున్నాడు.

రకరకాల పూలమొక్కల్ని వీధి వీధంతా అతడి యింటినించి అడిగి తీసికెళ్లడంతోనే గొడవ మొదలైంది. మల్లయ్యకు ఆ కాలనీ అంతా నందనవనం కావాలని ఆశ. అడిగిన వారికల్లా ఎన్నో మొక్కలు యిచ్చాడు. వారికోసం ప్రత్యేకంగా రకరకాల మొక్కల మినీ నర్సరీ పెంచాడు. చాలా మంది వాటిని తీసుకున్నప్పుడు చూపే శ్రద్ధ పెంచడంలో చూపలేదు. ఎంతో కష్టపడి పెంచిన మొక్కలు వారి పాలబడి ఎండిపోవడం అతన్ని కలిచివేసింది.

ఎపుడూ పూలకనో, ఉచితంగా పంచే కూరగాయలకనో ఆ వీధి ఆడవాళ్లతో ఆ యిల్లంతా ఎంతో రద్దీగా ఉండేది. పావని ఎంతో ముద్దుగా పెంచుకున్న రకరకాల గులాబీల్ని ఓసారి ఎవరో మొత్తంగా తెంపుకెళ్లారు. ఎన్నని కాపలా కాస్తారు పాపం. పావని ఆ పూట అన్నం ముట్టుకోలేదు. మొక్కలు పెంచడంలో ఏమాత్రం శ్రద్ధలేని వారిని గమనించి కొత్త మొక్కలివ్వడం మానుకున్నాడు మల్లయ్య. ఉచితంగా పంచిపెట్టే కూరగాయలకని వచ్చేవారి కోసం మర్యాద చేయడం, టైం వేస్టు కావడంతో ఆ రద్దీ

తగ్గించడం కోసం బండిమీద కూరగాయలమ్మే అతనికి ఏదో ధరకు అమ్మడం మొదలెట్టింది ఎల్లమ్మ. అసూయకు అప్పుడే పుట్టింది బీజం.

ఆడవాళ్ల ముచ్చట్లు మల్లయ్యకు ఆ కాలనీలోని ఆదర్శ టైటిల్‌ను ప్రసాదించాయి. వాళ్ల భర్తలకది కష్టంగా తోచింది. ప్రతి తల్లీ ఎల్లమ్మ పిల్లల్ని చూసి వారిని ఆదర్శంగా తీసుకొమ్మని తమ పిల్లల్ని కోరేవారు. మాటమాటకు వాళ్ల ప్రసక్తే వచ్చేది. ఆ కాలనీ పిల్లల అభివృద్ధిలో ఎల్లమ్మ పిల్లల స్ఫూర్తి ఎంతో గొప్పగా ఉపకరించింది. పరీక్షలప్పుడు మా యింట్లోనే పడుకో నిన్ను చూసి మావాడు చదువుకొంటాడు అని పోటీలు పడి ఎల్లమ్మ పిల్లల్ని పిలిపించుకునేవారు. టీ, టిఫిన్ యిచ్చి ఎంతో ఆప్యాయత కనపరిచేవారు. మల్లయ్య పిల్లలు పిడుగులు. వారి స్థాయినందుకోవడం ఎవరివల్లా కాలేదు. వారిని చూసి నేర్చుకో అనే తల్లుల అలవాటు క్రమంగా వీరిపట్ల అసూయ రగిల్చినట్టయింది. అది ఎపుడు ఎలా అంటుకుందో చెప్పడం కష్టం. రానురాను అదే వారి పిల్లలకు మల్లయ్య పిల్లలకు మధ్య ఎడం పెంచింది. ఈ కోర్టు కేసులు ఇంటిల్లిపాదినీ ఆ కాలనీ వాసులను మరింత దూరం చేశాయి.

కోర్టులో రెండు కేసులూ తేలిపోయాయి. రేప్ కేసు సాక్ష్యం లేక వీగిపోయింది. సాక్ష్యం యిస్తే ఏం జరుగుతుందో మళ్లీ కొంత మచ్చు చూపడంతో దాడికేసు వీగిపోయింది. మొండివాళ్లతో పెట్టుకుంటే మన మానమే పోతుందని చెంపలేసుకున్నారు వాళ్లు. కాని మల్లయ్యకు ఆ కేసులిచ్చిన అనుభవ ముద్రలు మిగిలిపోయాయి. ఆ బర్రల్ని (మచ్చల్ని) ఎవరో ఒకరు గోకేవారు. మల్లయ్య తాను చదివిన చదువు యింత వ్యర్థమైందా అని బాధపడ్డాడు. తమను కులం పేరుతో విమర్శించడాన్ని అతను అరిగించుకోలేకపోయాడు. ఈ వీధిలో తాను ఎవరికన్నా తక్కువ? నడుమ కులం ఏం చేసింది అని ఆవేదన చెందాడు. బాగా ఆలోచనలో పడిపోయాడు.

తాను ప్రపంచ అర్థ శాస్త్రాలు చదివి చదివి అర్థ శాస్త్రంలో కులం నిర్వహించే పాత్ర మరిచిపోయాడు. చదివేస్తే ఉన్న మతి పోవడం అంటే యిదే అనుకున్నాడు మల్లయ్య.

అది అర్థం అయ్యాక అతనికున్న జ్ఞానం కొత్త అవగాహనలోకి రూపాంతరం చెందడం ప్రారంభమైంది. అంత దాకా అర్థం కాని లేదా మరిచి పోవాలనుకున్న జీవిత సత్యాలపై ఏదో కొత్త వెలుగు ప్రసరించింది. అంబేద్కర్ గొప్ప ఆర్థికవేత్త అయి ఉండి కూడా కుల నిర్మూలన తత్వవేత్తగా ఎందుకు పరిణామం చెందాడో కొత్త అర్థంలో అర్థం కాసాగింది. అంబేద్కర్ గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త కావడంవల్లే కుల నిర్మూలనా తత్వవేత్తగాఎదగడం సాధ్యమైందనే విషయాన్ని తానే కనుకున్నంత సంబరపడిపోయాడు మల్లయ్య. కుల నిర్మూలనా తత్వవేత్త కాకుండా ఎవడూ గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త కాలేడీ దేశంలో అని మల్లయ్య యిప్పటి విశ్వాసం. ఏమంటే కుల వ్యవస్థ గొప్ప అర్థశాస్త్రం కూడా.

కులం మానవ సంబంధాలకు విలువలు కట్టి వ్యాపారం చేస్తుంది. నాది ఫలానా కులం కన్నా పెద్ద కులం అనుకునే ప్రతివాడూ ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారే. ఈ వ్యాపార సూత్రాల్ని సూత్రీకరించిన అర్థశాస్త్రవేత్త మనువు. ఆచరణలో ఉన్నదాన్ని లిపిబద్ధం చేసినందుకు మనకు మనువు మీద కోపం ఎందుకు? అతన్నొక ప్లేటోలా, అరిస్టాటిల్‌లా అర్థశాస్త్రంలో భాగంగా అధ్యయనం చేయాలి. అతని సూత్రాల్ని అధ్యయనం చేసిన కొన్ని శూద్ర కులాలు తమ కులాల ధరలూ, విలువాపెంచుకున్నాయి. కమ్మ, రెడ్డి, వెలమ వగైరా యీ పనే చేశాయి. మిగిలిన కులాలూ యీ పనే చేయక తప్పదు. తమ కులం విలువ పెరిగేదాకా తనకీ కష్టాలు తప్పవు. ఇపుడు తాను తన కులం విలువ పెంచాల్సిన చారిత్రక దశలో ఉన్నాడు. తద్వారానే కులాలన్నీ సమానమవుతాయి. అన్ని కులాలూ సమానమైతే కుల సమస్య ఎక్కడుంటుంది? ఇలా వేల ఏళ్ల సమాజాన్ని మార్చాలనుకునే వాడు తన కులం కోసం పోరాడే వాడిగా రూపం కన్పించడం ఈ దేశంలోని వైచిత్రి అనుకున్నాడు మల్లయ్య.

మల్లయ్య తండ్రి కొడుక్కు శత విధాల చెప్పాడు. "కొడుకా సదువు రానోన్నని నామాట తీసేయ్యకురా! మన వాళ్లల్లో మన యిల్లుంటే మనకు గౌరవం-మన కులానికి గౌరవం. మన కులం కానోల్ల నడుమ యిల్లు కట్టుకుంటే మనకు ముందు ముందు ఎంతో నష్టం. మన కులపోల్ల నడుమ ఉంటే మంచికి చెడుకు అన్నిటికీ మంచిది. మనకులపోల్లు అనలే లేని కాడవద్దురా! వాళ్ళ నడుమ ఉంటే గౌరవిస్తారనుకుంటున్నావేమో, అది నీ భ్రమ. నీకులం, నీ బంధుమిత్రుల పేదరికం తెల్సేదాకే నీ మీద గౌరవం. నిజంగా నిన్ను గౌరవించే వాళ్లు నువ్వు మన కులపోలున్నకాడ ఇల్లు కట్టుకున్నా గౌరవిస్తారు". చచ్చి ఏడున్నాడో గాని తండ్రి మాటలో ఎంతో సత్యముంది. సోషలిస్టు ఊహల్లో పడి వర్గ దక్పథం పేరిట తాను ఎంత కోల్పోయాడో.


వర్గ దృక్పథంతో ఎన్నికోట్ల మందిని ఆర్గనైజ్ చేసినా కమ్యూనిస్టులు ఆయా వర్గాల, మతాల ప్రజల మధ్య కులం, మతం తాలూకు అంతరాలు పోగొట్టలేకపోయారు. అన్ని కులాలూ సమానమే అనే దక్పథాన్ని ప్రజలకు అలవరచలేకపోయారు. అందువల్లే రైతాంగ కార్మిక వర్గాల్లో, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల్లో కుల ప్రసక్తిలేని పెళ్లిళ్లు సర్వ సాధారణం కాలేక పోయాయి. ఈ దేశంలోని మనుషులు ముందు ఆయా కులస్థులు - ఆ తర్వాతే మనుషులు అని యిలా ఎపుడో ఒకప్పుడు ఏదో ఒక విషయంలోనైనా స్పష్టం చేసికొంటూనే వున్నారు. కులం వదులుకోలేని అగ్రకులాల వారి మధ్య తరగతి సంస్కృతే తమ సంస్కృతి అని భ్రమ చెందారు. వారి కథలు, కావ్యాలు, కష్టాలు, కన్నీళ్ళే తమవీ అనుకుని సచిత్ర వార పత్రికల్ని తెగ చదివారు. తామిపుడు కులం వదులుకునే మధ్యతరగతి కార్మిక వర్గాన్ని రైతాంగాన్ని, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాన్ని నిర్మించాలి. అపుడే కులాధిక్యత అనే "రియల్ ఎస్టేట్" వ్యాపారం అదృశ్య మవుతుంది. వందల ఏళ్ల యీ సాదా సత్యాన్ని తిరిగి కొత్తగా కొత్త రూపంలోంచి గ్రహించడానికి తనకు పాతికేళ్ల జీవితానుభవాలు కావాల్సివచ్చాయే అని కొంచెం సిగ్గుపడ్డాడు మల్లయ్య.

మల్లయ్య తాను యిన్నేళ్లు కోల్పోయిందేమిటో తెల్సుకున్నాడు. ఈ ఉద్యమాలేవో యిన్నాళ్లు తన వాళ్లకోసం చేసి ఉంటే తండ్రి ఎంత సంతోషించేవాడో. వర్గ దృక్పథం పేరిట తాను కొనసాగించిన స్నేహం, ప్రేమ, సంస్కృతి, మర్యాద, త్యాగం, ఉద్యమాల నిర్మాణం అంతా కొత్త రూపంలో కొనసాగుతున్న శ్రామిక కులాల వెట్టి చాకిరీయే. అది సమాజానికో, యితర వర్గాలకో చేస్తున్న వెట్టి చాకిరీయే. అందువల్లే త్యాగాలెన్ని చేసినా పాలసీ నిర్ణాయక నాయకత్వం శ్రామిక కులాల చేతుల్లోకి రాలేకపోతున్నది. అందువల్లే కావచ్చు, తమ త్యాగం, సహచర్యం ఎదుటివారిలోని కులాధిక్యతా భావాన్ని తొలగించలేకపోయింది. పైగా తమ త్యాగం, సాయం, ప్రేమ పొందాక వారిలో అంతకు ముందులేని కుల అహంకారం కొత్తగా తల ఎత్తుతోంది. తన సాయం పొంది పైకొచ్చిన అచ్యుతరావు, రాజరెడ్డి కూడా .... ఇలా ప్రతీతరంలో కొత్తగా పుట్టి కొత్త రూపాల్లో ఆచరించబడకపోతే కులాధిక్యత ఏనాడో అదృశ్యమై ఉండేది..... నిట్టూర్చాడు మల్లయ్య.

మల్లయ్య తన అల్లుడు సధాకర్, కూతురు సుధ గురించి ఒక నిశ్చయానికి వచ్చాడు తనకు ఎంతో ఆర్థిక భారమైనా తప్పదు అని బరువుగా నిట్టూర్చాడు. వీళ్ళిద్దరు తమ చదువు కొనసాగించడమే ముఖ్యం. అవసరమైతే అల్లుడు తనకొచ్చిన ఉద్యోగం వదులుకోవడమే సరైంది. ఇదే మాట అల్లుడికి చెప్పాలి. ఎన్ని యిబ్బందులెదురైనా తమకు అందుబాటులో ఉన్న 'విద్య-విజ్ఞానం' అనే యీ ఒకే ఒక "రియల్ ఎస్టేట్" సంపాదించుకోవడమే తమ కర్తవ్యం. మబ్బు విడిపోయినట్టు మల్లయ్య హృదయం ఎంతో తేలికపడింది.

"అన్నీ రెడీ అయ్యాయి నాన్నా! తొందరగా రెడీ అవ్వు!" అన్న శ్రావ్య పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు మల్లయ్య. గబగబా టవల్ తీసికొని "అయిదు నిమిషాల్లో రెడీ అవుతాను. ఈ లోపు ఆటోలు పిల్చుకురండి" అంటూ బాత్రూంలోకెళ్ళాడు మల్లయ్య.

సాహిత్య నేత్రం త్రైమాస పత్రిక (6-7 సంచికలు)
డిసెంబరు **1996** (రచనా కాలం, జూన్ **1995**)
ఇండియన్ లిటరేచర్ (ఇంగ్లీష్ బైమంత్లీ) **2000**



కథా నిలయం
5586
శ్రీకాకుళం